ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 26, జులై 1999

# అర్ధనారీశ్వరులు

**మా**నస చదివింది మాథమెటిక్సే! పైగా, మంచి మార్కులతో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కూడా చేసింది. ఉద్యోగం కూడా భేషయింది దొరికింది. ఆపైన తనని ప్రేమించిన, తను ప్రేమించిన వాసుకు భార్య అయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇల్లు విస్తరించింది. అయితే ఆశ్చర్యం ఏమిటంటే, ఎవరైనా సరే 'అంతా బాగానే ఉంది' అనుకుంటూ కాస్తంత

ఊపిరి తీసుకుని స్థిమితపడేలోపునే ఏదో ఓ అవాంతరంలాంటిది నేనూ ఉన్నానంటూ ప్రత్యక్షమవుతుందిట! భగవంతుడనేవాడు, ఏం పెద్దమనిషోగాని దణ్ణాలు పెట్టి, పూజా పునస్కారాలు చేసి, కానుకలు సమర్పించినవారికి ధీటైన వరాలు ఇవ్వడం మానేసి వాళ్ళనే 'మోస్ట్ నెగ్లెక్టెడ్' గాళ్ళ జాబితాలోకి నెట్టేస్తూంటాడని చాలామంది వాపోతూంటారు. అందుకే ఆ వేళ మానస కూడా పై వాడిని అతి కొద్దిగా అపార్థం చేసుకుంది. దానికి కారణం, నిజానికి ఏమంత పెద్దది కాదు.

తన సంపాదనా, భర్త సంపాదనా కలిపి నెలకు పదివేలు దాటుతుందని ఆమెకు తెలుసు. అయినా ప్రతి నెలా, ఇల్లు నత్తనడక పోకడతో గడవడం ఆమెకు మొదట్లో విస్మయంగా ఉండేది. ఆ తరువాత అది వరుసగా అనుమానాలకు, భయాలకు చోటిచ్చింది. దాంతో వాసును పక్కనే కూర్చోపెట్టుకుని, కాగితాలు, కాలిక్యులేటరూ చేత ధరించి నెలవారీ ఖర్చులు ఏ దిశగా పోతున్నాయో తేల్చబోయింది. ఊహూఁ గంట అయినా ఆమె గట్టున పడలేకపోయింది. కాగితాలు నలుపయ్యాయి. కళ్ళు మూతలు పడసాగాయి. అయినా మానస తనవీ, భర్తవీ డైరీలు తిప్పుతూనే ఉంది.

ఈలోపున నెమ్మదిగా వాసు మంచం ఎక్కి, అక్కడి నుంచే మానసను చూసి, ఓ సారి చిద్విలాసంగా నవ్వి, "ఎక్కడో, ఏ ఖర్చులో మర్చిపోయి ఉంటాం. వాటికోసం బుర్ర బద్దలు కొట్టుకోవడం దేనికి? పోయింది పొల్లు, మిగిలిందే అసలు అని సరిపెట్టేసుకుందాం!" అన్నాడు.

మానస 'అలానా!' అన్నట్టు వాసువైపోసారిచూసి పంతం వీడని పడతిలా తన పనిలో మునిగిపోబోయింది. మధ్యలో కాలిక్యులేటర్ మీద విసుక్కుంది ఒకటి రెండుసార్లు.

"ఏమయింది"

"మూడు నెలలు వెనక్కి వెళ్ళాను. మీరు చేసిన ఖర్చులే అంతు తేలడం లేదు.!"

"అంటే?" అని వాసు వెంటనే దుప్పటిలోకి ఇట్టే అదృశ్యమై అందులోంచే ఒకటి రెండు ఆవలింతలు చిన్నగా వినిపించాడు.

మానస మరో అరగంట లెఖ్ఖలతో కుస్తీ పట్టి గత ఆరు నెలలుగా భర్త తన చేతికి అందిస్తూ వచ్చిన జీతం ఎంతోగుర్తు చేసుకుని, ఏదో క్లూ దొరికినట్టు 'అవునూ' అని వాసుని నిలదీయబోయింది. కానీ వాసు దుప్పటిలోంచి ఆమె ముఖకవళికలు గ్రహించి తనే ముందుగా అనేశాడు.

"మానసా! నిజమే, నా జీతం పెరిగింది. డిడక్షన్స్ పెరిగాయి. ఒకవేళ నువ్వుగానీ పొరబాటున నా గ్రాస్ ఎమౌంట్ నెట్‌గా లెఖ్ఖేస్తున్నావేమో..."

మానస వెంటనే, "అదేం కాదు, తమరికి ఆర్నెల్లుగా నెలకు వెయ్యి రూపాయలు రికవరీ కనిపిస్తోంది. ఇది సరికొత్త ఎడిషన్ అని నా అనుమానం. ఇది హఠాత్తుగా ఎలా వచ్చి చేరిందో విశదీకరిస్తారా, స్వామీ!" అంది.

"అవును, మనం మా అక్క కొడుకు పెళ్ళికి వెళ్ళాం. మరోసారి తిరుపతి యాత్ర... ఓ సారి మనకూ, పిల్లలకూ కొత్త బట్టలు... ఇంకా...."

"ఎప్పుడడిగినా అవే చెప్తారు. ఇవి గడచిన సంవత్సరంలో జరిగిన ముచ్చట్లు. నన్ను కన్‌ఫ్యూజ్ చేయద్దు. నిన్న ఆ పాత లెఖ్ఖలన్నీ కంప్యూటర్‌లో చేసి చూసినవే!"

"బహుశా, ఆ సమయంలో నీ జీతం, ఆ లెఖ్ఖలు కంప్యూటర్‌కి ఫీడ్ చేయడం మర్చిపోయావేమో..." అని వాసు దుప్పటిలోంచి విముక్తుడై బాసినపీట వేసుకుని కూర్చుని, ఓసారి నుదురుకొట్టుకుని "నువ్వు ఎం.ఎస్. ఆఫీసు, ఫాక్స్‌ప్రోలు అవీ ఇవీ నేర్చేసి ఉన్నదానివి. దాని వల్ల దేశానికి జరిగే మేలు అటుంచి మనిద్దరి మధ్యా మాత్రం అపోహలు చెలరేగుతున్నాయి.... ఇదంతా ఆ బిల్‌గేట్‌గాడు చేశాడు. ప్రపంచాన్నే కాదు, అన్యోన్యంగా ఉండే కుటుంబాల్లో కూడా తన కంప్యూటర్ తెలివితో కలతలు రేపుతున్నాడు!" అన్నాడు.

మానస నవ్వేసి అంది "ఈ తరం ఇంటి ఇల్లాలికి బిల్‌గేట్‌గాడు నిజంగా ఓ దేవుడు... యుగాలుగా మీలాంటి భర్తలు భార్యల దగ్గర చెప్పే తప్పుడు లెఖ్ఖలకు పెద్ద తెర ఒకటి దించిపారేశాడు. ఇదిగో, వాడి ఫొటో కొని తెచ్చాను. ఇక నుంచి ప్రతి శనివారం, వేంకటేశ్వరస్వామికి మానేసి అతగాడికి కొడతాను కొబ్బరికాయ!"

"ఏడాదికోసారి తిరుపతి మానేసి అమెరికా వెడదాం అని మాత్రం మొక్కుకోకు ... మధ్యలో నేను చస్తాను!"

"చస్తానంటే గుర్తొచ్చింది.... పది రోజుల్లో పండగ వస్తోంది. అత్తగారూ, మామగారూ వస్తారు. బట్టలు కొనాలి. ఎలా? బాలెన్స్ చూస్తే ఏం లేదు. అమ్మో, నాకు భయంగా ఉంది!" అంది మానస గుండెల మీద చెయ్యి వేసుకుని.

"సంసారంలో లైటనింగ్ ఎక్స్‌పెండీచర్‌లు తప్పవు. మానసా!"

మానసకు చిరాకూ, కోపం ఒక్కసారి వచ్చాయి. "అన్నీ తెలిసి దుబారా ఖర్చులు చేసే మిమ్మల్ని అనాలి... నాకు తెలియదనుకోవద్దు... అటూ ఇటూగా నెలకు వెయ్యి రూపాయలు స్వామివారే కైంకర్యం చేస్తున్నారు!" అంది.

'స్వామి వారంటే సాయిబాబానా, సత్య సాయిబాబానా, విభూతి బాబానా?"

"కాదు, మీరే ఆ పెద్ద స్వాములు! తెలియనట్లు మళ్ళీ ఏక్షన్ ఎందుకు?"

వాసూ గలగలా నవ్వేశాడు.

"ఏడాదికోసారి వాచీ మారుస్తారు. ఆరు రెడీమేడ్ జతలు కొంటారు. దండగమారి పై ఖర్చులు. వయసు మీద పడుతుంటే షోకులకు కళ్ళెం వేసుకోవాలండీ! ఇలా అయితే ఈ బండి ఈదడం నా వల్ల కాదు, చెప్పేస్తున్నాను...."

"ఏం చేయమంటావ్? పోనీ, ఆఫీసుకు గోచీ పెట్టుకుని వెడితే బావుంటుందేమో ఆలోచించు... బోల్డు ఎకానమీ!"

మానస నవ్వేసింది. ఆపైన చిన్నగా అంది "లావిష్‌గా ఖర్చు చేయడానికీ, ఫూలిష్‌గా

ఖర్చు చేయడానికీ తేడా ఉందంటారు పెద్దలు...”

“నిజమే అనుకో...” అని బుర్ర గోక్కున్నాడు వాసు.

“అయినా మీకు స్నేహాలు, తిరుగుళ్ళూ ఎక్కువండీ! ఆడపిల్లలం.... మేం పెళ్ళవగానే ఇట్టే సంసారంలో ఇమిడిపోతాం. కానీ విద్యార్థి దశను, బ్రహ్మచారి దశను నెమరువేసుకుంటూ, అటు డబ్బును, ఇటు కాలాన్నీ వృథా చేసేది మీ మగాళ్ళే!” అంది ఎగతాళిగా మానస.

“అవును కాబోలు!”

“మా ఆఫీసులోపనిచేస్తాడు... మీ రామచంద్రంగారు.. చేసేది పెద్ద ఉద్యోగమే. కానీ నేల మీద నడవడు. అందుకే మా కౌసల్య ఏడుస్తుంది. ఎప్పుడూ తెగ అప్పులు చేస్తాట్ట. దీని జీతం కూడా హారతి పట్టేస్తాట్ట!”

“వాడు మరీ దుబారా మనిషి!”

“ఆయన గారిలా మీరూ తయారవుతారని నా భయం!”

“అభయమిస్తున్నాను. అలా కానులే!”

“ఆ అభయమేదో పైవాడు ఇవ్వాలి. ఆ అందుకే శనివారంతోపాటు, గురువారం కూడా ఉపవాసాలు ఉంటున్నది!”

❖ ❖ ❖

“ఓరి ఫూల్! మన ఖర్చు విషయం వచ్చినప్పుడు భార్యల్ని ఎక్కువగా నమ్మకూడదురా! వాళ్ళకు అన్ని విషయాలూ చెప్పకూడదు. ఒట్టినే గుండెలు బాదుకుని ఏడుస్తారు. పైగా, ఉద్యోగం చేసే భార్యలున్నారు చూశావూ... వాళ్ళు యమడేంజర్! మనం మన జీతాన్ని ఎక్కడ దుబారా చేసి పారేస్తామోమోననీ, ఎక్కడ మన తరపు వాళ్ళకు ఖర్చు చేస్తామేమోనని తమ జీతాన్ని సగానికి సగం వెనకేస్తూ ఉంటారు. ఉపన్యాసాలు ఇస్తారు!” అంటూ రామచంద్రం తన ముందు కుర్చీలో కూర్చుని, ఆపైన బేలమొహం వేసుకుని ఉన్న వాసుకు తనదైన ధోరణిలో చెప్పాడు.

“ఏమీ అనుకోకు... నీ మిసెస్ నీతో ఏ రకమైన అబద్ధాలు చెప్పి డబ్బు వెనకేస్తోందిరా! కొన్ని క్లూలు ఇస్తానని అడుగుతున్నాను!” వాసు ఆసక్తితో అడిగాడు.

“ఒకరకం కాదురా, బాబూ! రెండు వందలు పెట్టి చీర కొనుక్కుని ఐదువందలంటుంది. మేకప్ మెటీరియల్ వాటి ఖర్చులూ అడగనే వద్దు. పాత చీరలిచ్చి స్టీలు సామాన్లు కొని, అవి ఆఫీసులో ఎవడో ఇన్‌స్టాల్‌మెంట్‌లో అమ్మాడంటుంది. ఇక ఇంటికి కావాల్సిన సామాన్ల ధరా, ఆ బిల్లులూ అన్నీ ట్రాష్‌లే అనుకో...! వాటి ఖరీదులు చూస్తే అన్నం కూడా తినబుద్ధి వేయదు... ఏం చెప్పను?”

“అసలు ఆడవాళ్ళు మొగుళ్లకు తెలియకుండా ఇలా డబ్బు ఎందుకు వెనకవేస్తారంటావ్? ఇది వాళ్ళ నైజమా, మన పాపమా?”

"మనదీ, పిల్లల భవిష్యత్తు, ఇంటి బాగు... ఇంకా ఇంకా నా బొందా అన్నీ దృష్టిలో పెట్టుకుని వాళ్ళు ఎప్పుడూ కిందా మీదా అవుతూంటారు."

"బాధపడకురా. స్థిమితపడు!"అన్నాడు జాలిగా వాసు.

"మొన్న మా అత్తగారూ, మామగారూ వచ్చారు. వాళ్ళ ఊళ్ళో ఇళ్ళ స్థలాలు చవకట... నెలకు వెయ్యి రూపాయల చొప్పున యాభై నెలలు కడితే చాలుట. ఆ స్థలం రేపు పిల్లల పెళ్ళి నిమిత్తం పడి ఉంటుందిట. దాంతో మా ఆవిడ హుషారెక్కిపోయి వద్దంటున్నా వినకుండా నన్ను స్కీమ్‌లో జేర్పించింది. ఆ తర్వాత రోజూ నా ఖర్చులు తగ్గించుకోమని పోరు!"

"ఇప్పుడనిపిస్తోందిరా, రామచంద్రం హాయిగా మనం చదువుకోని అమ్మాయిల్ని పెళ్ళి చేసుకోవాల్సింది, చదువుకుని ఉద్యోగాలు చేసే పెళ్ళాలతో వేగడం చాలా ఇబ్బందిరా! అన్ని ఆరాలు తీస్తారు. పైగా మనం పనిచేసే ఆఫీసుల్లోని ఆడంగులతో స్నేహం చేసి మన గుట్లన్నీ లాగుతారు!"

రామచంద్రం ఓసారి వాసు మొహం చూసి, జాలిగా నవ్వేసి, "అందుకేనా ఈ మధ్య నెలవారీ పార్టీలు ఎగ్గొడుతున్నావ్? పోనీలే... అదృష్టవంతుడివి.. నువ్వైనా నీ భార్య మాట విని బాగుపడు! నేనెలాగూ చెడ్డాను. నోరు కట్టుకోవడం నా వల్ల కాదు! నోరు మూసుకుని ఊరుకోవడం ఆమె వల్లా కాదు!" అన్నాడు.

"నాది జాలి గుండెరా... మా ఆవిడ బాధపడితే చూడలేను!"

"వెధవ డిఫెన్స్ ఆపు! నువ్వు మెతక మనిషివి!"

"అవునురా, రామచంద్రం! మా అమ్మకు నెలకు వెయ్యి రూపాయలు పంపిస్తాను. నాలుగేళ్ళుగా ఆవిడ నెలకు ఐదు వందలు పోస్టల్ సేవింగ్స్‌లో పెడుతోంది. మా అమ్మా, నాన్నా పెద్దవాళ్ళయ్యారు. ఎప్పుడు ఏ ఖర్చు వస్తుందో తెలియదు. పోనీ, ఈ విషయం ఇంట్లో చెబుదామా అంటే మానస అర్థం చేసుకోదని భయం!"

"మా ఆవిడా అంతేరా, ఏదైనా అంటే నీకు నీ తల్లితండ్రులెంతో నాకు నా తల్లితండ్రులూ అంతే అంటుంది! పెళ్ళయినా ఆడపిల్లలు తన తల్లిదండ్రుల్ని ఆదుకోవడం ఆగదని ధణాయించి ఎదిరిస్తుంది!" రామచంద్రం అన్నాడు.

"ఏమిటోరా... ఈ బతుకులింతే! మనకన్నా పూర్వంలో ఏకచేతి సంపాదన గాళ్ళే ఎక్కువగా సుఖపడ్డారనిపిస్తుంది. ఏమైనా ఉపాయం ఉంటే చెప్పరా!"

రామచంద్రం వెంటనే ఓ పెగ్ లాగించాడు. ఆ పైన ఆమ్లెట్ తిన్నాడు. కాసేపు ఆలోచించాడు. బుర్ర గోక్కున్నాడు. మరో పెగ్ వేసుకున్నాడు. ఓ పెట్టె సిగరెట్లు కాల్చాడు. ఆ తర్వాత చికెన్‌బిరియానీ లాగించాడు.... మళ్ళీ పెగ్‌కు ఆర్డరిచ్చాడు. వాసు విస్మయంతో స్మైల్ చేస్తూ రామచంద్రం వైపు చూస్తున్నాడు.

"ఉందిరా ఓ ఉపాయం! ఒకటే దారి. మనకెలాగూ ఎకౌంట్స్ రాయడం వచ్చు.

కంప్యూటర్ నాలెడ్జ్ ఉంది. ఇకముందు బుద్ధిమంతుల్లా ఐదింటికి ఇంటికి పోకుండా పార్ట్‌టైమ్ జాబ్ చేసుకుందాం. ఆరుగటల నుంచి ఓ రెండు మూడుగంటలు పనిచేద్దాం. ఈ విషయం ఇంట్లో చెప్పద్దు. ఆ జీతం సొంతం మన ప్రైవేటు ప్రాపర్టీ అవుతుంది. నువ్వు నీ ఇష్టం వచ్చినట్టూ, నేను నా ఇష్టం వచ్చినట్టూ ఖర్చుచేసుకోవచ్చు.... అనవసరంగా పెళ్ళాలకు దొంగ లెఖ్ఖలు చెప్పాల్సిన అవసరం ఉండదు ఇక! ఏమంటావ్?"

"అవును, ఇలా గట్టున పడొచ్చురా నేను కూడా...! ఇదే దారి!" అన్నాడు వాసు.

రామచంద్రం నిషా నవ్వు నవ్వాడు. వాసు హుషారుగా కుర్చీలోంచి లేచాడు.

❖ ❖ ❖

"ఇదేమిటి? ఒక్కసారిగా మనిల్లు ఇంత ఇరుకయిపోయింది!" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు వాసు.

"ఏమీ అనుకోవద్దు,మిమ్మల్ని అడగకుండా ఓ అడుగు ముందుకు వేశాను. రండి, చూపిస్తాను!" అంటూ మానస వాసు చేయి పుచ్చుకుని వేసి వున్న గది తలుపులు ఓరగా తెరిచింది. ఆ గదిలోకి కొత్తగా నాలుగు పెద్ద స్టీల్ రాక్‌లు వచ్చి చేరాయి. రెండింటి నిండుగా రకరకాల చీరలు పేర్చి ఉన్నాయి. మిగిలిన రెండింటిలో అన్నీ గృహోపయోగ పరికరాలు, అన్నీ అధునాతనమైనవే! రకరకాల కంపెనీలకు చెందిన మిక్సీలు... ఎలక్ట్రిక్ స్టౌలు, చపాతీలు చేసేవి, బ్రెడ్‌లు కాల్చేవి... అలా కొన్ని! నాన్‌స్టిక్ పాన్‌లు, డ్రై మిక్సీలు... మరో పెద ఎలక్ట్రానిక్స్ టాయిస్‌లు. వాసు అవన్నీ చూసి ఆశ్చర్యపోయాడు. ఈసారి మానస తలుపులు బార్లా తెరిచింది. దాంతో వాసుకు ఆ గదిలో ఓ పక్కగా కూర్చున్న ఓ అందమైన అమ్మాయి కనిపించింది!

"ఇదేదో సూపర్ బజార్‌లా ఉంది. ఈ అమ్మాయి ఎవరు? ఏమిటిదంతా?" అంటూ వాసు విసుగ్గా మానస వైపు చూశాడు.

"ఆ అమ్మాయి పేరు నళిని... మన కౌసల్యగారి చుట్టాలమ్మాయి."

"అయితే?"

అప్పుడు మానస ఆ గదిలో కూర్చుని నళిని గురించి ఆసాంతం చెప్పింది. టూకీగా దాని సారాంశం ఇది!

నళినికి నా అన్నవాళ్ళు లేరు. బాల్యం అంతా అనాథ ఆశ్రమంలోనూ, ఆ పైన కానివాళ్ళ దగ్గరా గడిచింది. చిన్నపాటి చదువు అబ్బడంతో ఓ మాదిరి ఉద్యోగం దక్కింది. ప్రస్తుతం ఆమె అవివాహిత... తన సంపాదనను పెంచుకునే ఉపాయాల కోసం వెదుకుతూంటే ఆమెకు కౌసల్యా, మానస ముందుగా తారసపడ్డారు. కుటుంబ తరహాలో ఏ ఆర్భాటాలూ లేకుండా, తక్కువ లాభాలు ఆశిస్తూ ఈ రకమైన వ్యాపారం చేయడం మంచిదనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనకు రూపకల్పన చేయగా వాస్తవంలో అది ఇలా దర్శనమిస్తోంది.

"అంతా బాగానే ఉంది, దీనికి పెట్టుబడి అవసరం అవుతుందే!" అని వాసు సందేహంగా నళిని మొహంవైపు చూశాడు.

"నాకు ఇద్దరు అక్కలతో సమానమైన మీ శ్రీమతిగారూ, మా కౌసల్యగారూ అండగా నిలబడ్డారు. వారికి తెలుసున్న పెద్ద వ్యాపారి ద్వారా సరుకులు ఇప్పించారు!"

"అంటే...?"

"నేనూ, కౌసల్యా ష్యూరిటీలుగా నిలబడ్డాం. ఈ విషయాలన్నీ మీకు ఆలస్యంగా చెప్పినందుకు క్షమించాలి!" అంది మానస.

"బాగుంది!" అన్నాడు వాసు చిన్నగా.

"అయితే మీ చేత్తో కొబ్బరికాయ కొట్టి, అగరవత్తులు వెలిగిస్తే నేను చాలా సంతోషిస్తాను. ఈ వేళ మంచిరోజు!" అంటూ నళిని ఆ సరుకుల కోసం బయటకు వెళ్ళింది. అప్పుడు వాసు మానస మొహం వైపు చూశాడు. భర్త మొహంలో కదులుతున్న ప్రశ్నలన్నీ ఆమెకు అర్థం అవుతున్నాయి.

"నళిని నమ్మకస్తురాలు... మీరేమీ భయపడకండి! పైగా, మనకు నెలకింతని అద్దె వస్తుంది!"

"ఆమె పెళ్లి చేసుకుని సడెన్‌గా వెళ్ళిపోయిందనుకో... ఈ సరుకులు అమ్మేదెవరు? ఆలోచించే ష్యూరిటీలు ఇచ్చావా?"

"నళిని అటు మీ ఫ్రెండ్ రామచంద్రంగారికి కూడా చుట్టమే. మాకు ప్రోత్సాహం ఇచ్చిన వాళ్ళలో ఆయన కూడా ఒకరు!"

"ఇల్లు ఇరుకయిపోయింది..."

"ఏం ఫర్వాలేదండీ! పిల్లలు ట్యూషన్ల నుంచి ఎనిమిది దాటితేగాని రావడం లేదు. మీరూ సాయంకాలం మామూలు టైముకు ఇంటికి చేరడం లేదు. నాకూ పార్ట్‌టైమ్ జాబ్‌లా ఉంటుంది!" అని మానస చిరునవ్వుతో భర్త మొముంలోకి చూసింది.

"పార్ట్ టైమా?" అన్నాడు అదోలా.

"ఆఫీసు నుంచి వచ్చి, ఎవరూ లేని అనాథకు చేదోడు వాదోడుగా ఉండడం అంటే అదీ పార్ట్‌టైమ్ జాబ్‌కిందకే వస్తుంది కదా!"

"అవునవును... సరే, కానీయ్! నీ ఇష్టం! అదిగో, మీ నళిని వస్తోంది. నేను అలా వెళ్ళొస్తాను!"

"రామచంద్రంగారి దగ్గరకా?"

"కాదు..."

"మరెక్కడకండీ, కొబ్బరికాయ కొట్టవల్సి ఉంది.... ఆ పరుగేమిటి?"

"ఆ పని నువ్వు కానివ్వు!" అంటూ వాసు గుమ్మాలు దిగి వెళ్ళిపోయాడు.

నళిని లోపలికి వస్తూ అప్పటికే దూరంగా వెళ్ళిపోతున్న వాసూని చూసి, మానసతో,

"నే వచ్చిన పని అయింది. మరి, వెళ్ళొస్తాను!" అంది.

"థాంక్స్ నళినీ! నీ ఉపకారం నేనెప్పటికీ మర్చిపోను!"

"ఇందులో నే చేసింది ఏం ఉంది అక్కా? నేను ఫిగర్ హెడ్‌ని మాత్రమే... ఆలోచనా, పెట్టుబడీ మీవేగా?" అంది.

"అవుననుకో... కానీ ఈ వ్యాపారంలో రాణిస్తానో లేదో! లాభాలు రాకపోయినా, నష్టాలు రాకపోతే చాలు!

"భయపడకు. నా తరఫున నేనూ కష్టమర్లను తీసుకువస్తాను."

"ఇంతకుమించిన నాకు వేరే దారి దొరకలేదు, నళినీ! నాలుగు నెలల్లో మా చెల్లాయి పెళ్ళి ఉంది. నాన్నగారికా వయసు మీద పడింది. గడించిందీ తక్కువే! మా ఇద్దరి జీతాలు, పెరిగిన ఖర్చులు చూసిన తరువాత భగవంతుడు మనిషికి రెండే చేతులిచ్చి తప్పు చేశాడని అనుకునేదాన్ని... కానీ ఆయన మనిషికి వరంగా వివేకం. ముందు చూపు ఇచ్చాడనీ, వాటిని ఉపయోగంలోకి తెచ్చుకోగలిగితే సాధ్యం కానిది ఉండదనీ, ఈ వేళ అర్థమైంది. అవును కదూ?"

నళిని అటూ ఇటూ చూసి, "అక్కా... ఇంతకాలం చెప్పలేదు.... బావగారూ కూడా మంచి ఆలోచనాపరులే! నీలాగే ఆయనా ఇంటి పరిస్థితులు చూసి బాధపడి ఉంటారు. అందుకే అనుకుంటాను ఆయన రెండు నెలలుగా 'ఫ్యూచర్ కంప్యూటర్స్' అనే సంస్థలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నారు. వాళ్ళు జీతం బాగానే ఇస్తారనుకుంటాను!" అంది.

మానస విస్తుపోతూ, 'అలానా!' అంది.

"నీకుతెలియదా, అక్కా?"

మానస మాట్లాడలేదు. ఆమె ఆలోచనలు రకరకాలుగా పోతున్నాయి. చిలవలుపలవలు వేస్తున్నాయి. ఆ పైన చటుక్కున అవి వక్రమార్గంవైపు మళ్ళి ఆమెను అనుమానాలకు గురిచేశాయి. ఆ తతంగం కాసేపు సాగింది. అయినా మానస తనని తాను ఆలోచనల నుంచి దూరంగా జరిగింది. దాంతో మానసకు తన అంతర్యంతో పాటు, భర్త వాసు అంతర్యం కూడా అర్థమైంది. ఓ గూటి కింద కాపురం చేసే భార్యాభర్తలు ఎప్పుడూ దోబూచులే అడుకోవాలి గానీ.... తమ తమ వారి క్షేమం కోసం, మరీ శ్రుతి మించి దొంగాటలాడుకోవడం ప్రమాదాలకు, కాకపోతే అపోహలకూ దారితీయవచ్చుననే ఓ గొప్ప నిజం తెలిసొచ్చింది!

ఆ క్షణమే వాసు మృదువుగా తన చెంపలు నిమిరినట్టు, తనూ ముద్దుగా అతని చెంపల్ని తాకి ముద్దులిచ్చి శిక్షించినట్టూ చిన్న ఊహ ఆమెలో కదిలింది!!

❖